# సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025




కలెక్టర్లు వల్లూరు క్రాంతి, ఆశిష్ సంగ్వాన్ దంపతులు

# ప్రేమంటే గౌరవం.. బాధ్యత

## పరస్పర అవగాహనతోనే ప్రేమ కలకాలం

- ఒకరి బాధ్యతలను మరొకరు పంచుకోవాలి
- చిన్న వయస్సులో ఆకర్షణకు లోనుకావద్దు
- ఆలోచనల్లో పరిణతి వచ్చాకే నిర్ణయాలు తీసుకోవాలి
- జీవితంలో ప్రేమే కాదు కెరియర్, ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం ముఖ్యం
- 'సాక్షి'తో యువ ఐఏఎస్ అధికారి వల్లూరు క్రాంతి
- ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తన మనోభావాలు పంచుకున్న కలెక్టర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ''నేను.. ఆశిష్ ఇద్దరం ఢిల్లీ ఐఐటీలోనే చదువుకున్నాము. అక్కడ బీటెక్ పూర్తయ్యాక నాకు యూపీఎస్సీ ద్వారా ఐఆర్‌టీఎస్ (ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసు)లో ఉద్యోగం వచ్చింది. ఇదే ఉద్యోగానికి ఆశిష్ కూడా ఎంపికయ్యారు. లక్నో (యూపీ)లో ట్రెనింగ్ చేస్తున్న సమయం. ఆశిష్ అప్పుడే పరిచయం అయ్యారు. మంచి స్నేహితులుగా కొనసాగాము. ఈ ఉద్యోగాలు చేసుకుంటూనే ఐఏఎస్‌కు ప్రిపేర్ అయ్యాము. ఇద్దరం కూడా ఐఏఎస్‌కు ఎంపికయ్యాము. ఈ క్రమంలో మా స్నేహం ప్రేమగా మారింది. ఇద్దరం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. మా పెళ్లికి మా ఇద్దరి పెద్దల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. అప్పుడు కోవిడ్ లాక్‌డౌన్ కొనసాగుతోంది. దీంతో కర్నూల్‌లోని మా ఇంట్లోనే పెళ్లి చేసుకున్నాము. ఇరు కుటుంబాల నుంచి కేవలం పది పన్నెండు జంటలు మాత్రమే మా వివాహ వేడుకకు హాజరయ్యారు..'' అంటూ చెప్పుకొచ్చారు.. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి. జిల్లా పాలనపై తనదైన ముద్ర వేస్తున్న ఈ యువ ఐఏఎస్ అధికారి ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తన మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

**ప్రేమ – గౌరవం..**

''ప్రేమించడమంటే.. ఒకరినొకరు గౌరవించుకోవడమే. పెళ్లి తర్వాత ఒకరి మనోభావాలను మరొకరు అర్థం చేసుకోవాలి. ప్రేమలో బాధ్యత కూడా ఉంటుంది. సర్దుబాటు కూడా చాలా ముఖ్యం. మన భాగస్వామి కోసం సర్దుబాటు చేసుకునేందుకు ఏమాత్రం వెనుకాడవద్దు. ఇరువురు అలా వ్యవహరిస్తేనే ప్రేమికులు కలకాలం సంతోషంగా ఉంటారు..''



### ప్రేమ.. ఆకర్షణ..

ప్రేమ, ఆకర్షణ వేర్వేరు.. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమ అనుకుని చిన్న వయస్సులోనే ఆకర్షణకు లోనవుతున్నారు. బంగారు భవిష్యత్తును ఇబ్బందుల పాలు చేసుకుంటున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. యువత ఆకర్షణకు గురి కావడం సహజమే. కానీ, ఈ క్రమంలోనే కాస్త పరిణతిగా ఆలోచించాలి. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు గానీ, పెద్దలతో తమ అభిప్రాయాలను పంచుకోవాలి. తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. అలా కాదని చిన్న వయస్సులోనే ఇంటి నుంచి వెళ్లిపోవడం వంటి నిర్ణయాలతో జీవితమంతా అనేక ఇబ్బందులు పడటమే ఎక్కువగా జరుగుతుంది.''

**బాంధవ్యాలు – బాధ్యతలు..**

''పెళ్లి చేసుకున్నాక బాధ్యతలను పంచుకుంటేనే ఆ బంధుత్వం కలకాలం ఉంటుంది. బాధ్యతలను తప్పనిసరిగా పంచుకోవాలి.. ప్రస్తుత రోజుల్లో మహిళలు ఉద్యోగాలు, వ్యాపారాలు చేయడం సాధారణమై పోయింది. ఇల్లాలిగా ఇంటి బాధ్యతలు, బయట ఉద్యోగ, వ్యాపార బాధ్యతలు రెండూ మహిళలు మోయాల్సి వస్తోంది. ఈ క్రమంలో బాధ్యతలు షేరింగ్ చేసుకోవడం తప్పనిసరి. భార్య పరిస్థితులకు అనుగుణంగా భర్త నడుచుకోవాలి.. అలాగే భార్య కూడా.''

**ప్రేమ – పెళ్లి – కెరియర్..**

జీవితంలో ఈ మూడు ముఖ్యమైనవే. తనకు ఇష్టమైన వారిని ప్రేమించడం..వారినే పెళ్లి చేసుకోవడం .. ఈ క్రమంలో కెరియర్ కూడా ముఖ్యమే. వీటన్నింటిని బ్యాలెన్స్ చేసుకోవాలి. పర్సనల్ లైఫ్.. కుటుంబం కూడా చాలా ఇంపార్టెంట్.. ముఖ్యంగా యువత ఈ రెండింటితోపాటు కెరియర్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి.. ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా జీవితంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.''

**సంస్కృతి.. సంప్రదాయాలు..**

''ఆశిష్ సంగ్వాన్‌ది హరియాణ రాష్ట్రం..మాది కర్నూలు.. ఉత్తరాది రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలకు మనకు కొంత వ్యత్యాసం ఉంటుంది..నా చదువు నార్త్‌లోనే జరగడంతో అక్కడి కల్చర్..ఫుడ్ హ్యాబిట్స్ నాకు ముందు నుంచే అలవాటైంది. దీంతో పెళ్లి తర్వాత ఈ పండుగలు, సంస్కృతి విషయంలో పెద్దగా తేడా అనిపించడం లేదు..మన పండుగలతో పాటు, నార్త్ ఇండియాలో జరిగే దీపావళి, తీజ్ వంటి పండుగలను ఘనంగా జరుపుకుంటాం.''

**సమయపాలనతో..**

''ఉన్నత ఉద్యోగులం కావడంతో ఇద్దరికీ కొంత బీజీ షెడ్యూల్ ఉంటుంది. సమయపాలనతో ఈ సమస్యను అధిగమిస్తున్నాం. ఉద్యోగ బాధ్యతలతో పాటు, కుటుంబం కూడా ముఖ్యమే కదా! ఉద్యోగ బాధ్యతలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో..కుటుంబానికి కూడా అదే స్థాయిలో ప్రాధాన్యతనిస్తున్నాం. ఇందుకోసం తగిన సమయం కేటాయిస్తున్నాం.''

### యువతకు సలహా..

''ప్రేమ పేరుతో ఆకర్షణకు లోనై జీవితాన్ని ఇబ్బందులపాలు చేసుకోవద్దు. చిన్న వయస్సులో అనాలోచితంగా తీసుకునే నిర్ణయాలు జీవితాన్ని పాడు చేస్తాయి. మన ఆలోచన విధానంలో ఓ పరిణతి వచ్చాకే నిర్ణయాలు తీసుకోవాలి. ప్రేమ పేరుతో చదువును పాడు చేసుకోవద్దు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థాయికి చేరుకోగలం. సమాజంలో ఓ బాధ్యత గల పౌరునిగా ఉంటాం..''

## న్యూస్‌రీల్

### యువతే దేశానికి వెన్నెముక



మాట్లాడుతున్న చెన్నూరి రూపేశ్

జహీరాబాద్ టౌన్: యువతే దేశానికి వెన్నెముకని, యువత సన్మార్గంలో ఉంటేనే దేశం పురోగమిస్తుందని జిల్లా ఎస్పీ సీహెచ్.రూపేశ్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన 'ఆచార్య యువతరంగ్ 2025'కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రణాళికబద్ధంగా చదవడం వల్ల సులభంగా లక్ష్యాన్ని చేరుకుంటారని చెప్పారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమలో జహీరాబాద్ టౌన్ సీఐ, శివలింగం, ఎస్ఐ, కాశీనాథ్, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ హరికుమార్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకరాంరెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఆటపాటలతో అలరించిన మౌనిక**

ఆచార్య యువతరంగ్ కార్యక్రమంలో సింగర్ మౌనిక యాదవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె ఆటపాటలతో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సినిమా తదితర పాటలకు ఆడిపాడి డ్యాన్స్‌లతో అదరగొట్టారు.

### రాజీమార్గంతో కేసులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న భవాని చంద్ర

సంగారెడ్డి టౌన్: రాజీమార్గంతోనే కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జిల్లా కోర్టులో గురువారం న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాజీమార్గంతో ఎక్కువ కేసులను పరిష్కరించవచ్చని పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో ప్రవేశపెట్టాలన్నారు. మార్చ్‌8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి



మాట్లాడుతున్న రమేశ్

సంగారెడ్డిటౌన్: మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని అటవీ శాఖ కార్యాలయంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలపై లైంగిక వేధింపులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా ఉద్యోగులు, మహిళా కార్మికులు పనిచేసే ప్రదేశాలలో ఎక్కడైనా ఇబ్బందులు పడితే ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు, అటవీ శాఖ ఉద్యోగులు,ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం మహిళా నాయకులు

నారాయణఖేడ్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ వాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం మహిళా నాయకులతో కలసి ఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బకాయిలను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సంఘం స్థానిక బాధ్యులు లక్ష్మి, సువర్ణ, మమత, గౌరి పాల్గొన్నారు.

# పోరునగర్

- డంపింగ్‌యార్డ్‌పై వారం రోజులుగా జేఏసీ నిరసనలు
- కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో పనులకు బ్రేక్

జిన్నారం (పటాన్‌చెరు): పచ్చని పర్యావరణాన్ని పంటపొలాలను ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే విధంగా డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయవద్దంటూ గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ సమీపంలోని ప్యారానగర్ వాసుల ఆందోళనలు సర్వత్రా మిన్నంటాయి. ఈ మేరకు గ్రామస్తులు ఐక్యంగా కార్యాచరణలతో నిరసనలు, రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలకు దిగారు. ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే ప్రజాగ్రహానికిలోనుకాక తప్పదని ఆందోళనకారులు హెచ్చరిస్తున్నారు.

**భవిష్యత్తుకు ముప్పు...**

జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెత్తను నగర శివారులోని ప్యారానగర్ అటవీ సమీపంలోని 151 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుపై తొలినుంచి స్థానిక ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారు. చుట్టూ పచ్చని ప్రకృతి, సుదీర్ఘ వ్యవసాయ విస్తీర్ణం కలిగిన పంటచేలు ఆహ్లాదకరమైన పల్లె వాతావరణం డంపింగ్ యార్డు ఏర్పాటుతో దుర్భిక్షంగా మారే అవకాశాలు ఉన్నాయని, తమ భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఇక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టడంతో ఆందోళనలకు దిగారు. వీరి ఆందోళనలతోనైనా ప్రభుత్వం డంపింగ్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తుందా అనేది వేచి చూడాలి.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

**వినూత్న తరహాలో ఆందోళనలు...**

ఇప్పటికే జేఏసీ ఏర్పాటు చేసుకుని కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఫిబ్రవరి 4 నుంచి చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు దాదాపు 8వ రోజుకు చేరుకున్నాయి. వీరి ఆందోళనలు ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ వ్యవహారం ఆషామాషీగా తీసుకోకుండా జిల్లా అధికారులు సరైన విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తం అవుతుంది. పిల్ల, పెద్ద, పాడి పశువులు సైతం ఆందోళన కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు సైతం ప్రారంభమయ్యాయి. యువకులు సెల్ టవర్లు, వాటర్ ట్యాంకులు సైతం ఎక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. మండలంలో ఎటు చూసినా ఉద్యమ వాతావరణమే కనిపిస్తోంది.

**హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**

డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులను సవాలు చేస్తూ మాదాపూర్‌కు చెందిన స్వర్ణలత అనే మహిళ వేసిన వ్యాజ్యాన్ని న్యాయమూర్తి కె.లక్ష్మణ్ విచారించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది కైలాష్ పీఎస్‌ఎస్ వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులను నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ప్యారానగర్ లో డంపింగ్‌యార్డు ఏర్పాటును నిలిపివేయాలని ఎయిర్ ఫోర్స్ అకాడమీ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో గ్రామస్తుల ఆశలకు మరింతబలం చేకూరింది.

### కలుషితం చేయొద్దు



డంపింగ్‌యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. పచ్చని పంట పొలాలు, చుట్టూ అడవితో ప్రకృతి వాతావరణంలో ఉన్న గ్రామాన్ని డంపింగ్‌యార్డ్ ఏర్పాటుతో కలుషితం చేయొద్దు. డంపింగ్‌యార్డ్ ఏర్పాటైతే మా బిడ్డల బతుకులు అంధకారం అవుతాయి.

–అనసూయ, ప్యారానగర్ వాసి

### చెత్త తెస్తే ఊరుకోం



వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నాం. మా పంట పొలాల పక్కనే డంపింగ్‌యార్డ్ ఏర్పడితే మా పొలాల వైపు కన్నెత్తి కూడా చూడలేం. గతంలో ఏర్పాటైన పరిశ్రమల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. నగరంలోని చెత్తను మా గ్రామాల్లోకి తెస్తే చూస్తూ ఊరుకోం.

–శోభా, ప్యారానగర్ వాసి

### ఆలోచన విరమించుకోవాలి



గుమ్మడిదల మండలంలో ఇప్పటికే కాలుష్య సమస్యలు ఎదుర్కొంటున్నాం. మళ్లీ కొత్తగా డంపింగ్‌యార్డ్ ఏర్పాటు ఎంతవరకు సమంజసం. ప్రభుత్వం ఒంటెద్దు పోకడ వైఖరిని విడనాడాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. బలవంతంగా ఏర్పాటు చేయాలని చూస్తే ఉద్యమిస్తాం. డంపింగ్ యార్డ్ ఏర్పాటు ఆలోచన విరమించుకోవాలి.

–చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు

# నామినేషనా? కొనసాగింపా..?

- తొమ్మిదింటిలో ఆరు ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్లు బీఆర్‌ఎస్ వారే
- ముగ్గురు మాత్రమే కాంగ్రెస్
- ఈ పాలకవర్గాలపై సర్కారు వైఖరి ఎటువైపో?
- డీసీసీబీలతో పోలిస్తే భిన్నంగా రాజకీయ పరిస్థితులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాల్లో కీలకమైన డీసీఎంఎస్ (జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ)ల పాలక వర్గాల పదవీకాలం విషయంలో సర్కారు నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. తొమ్మిది డీసీఎంఎస్‌లలో ఆరు ఉమ్మడి జిల్లాల చైర్మన్లు ఇప్పటికీ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీసీఎంఎస్‌ల పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగిస్తారా..? లేక నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తారా..? అనే దానిపై శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే డీసీసీబీ పాలకవర్గాలకు పదవీకాలం పొడిగించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అయితే డీసీఎంఎస్‌ల విషయానికి వస్తే రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు డీసీఎంఎస్‌లు మూడు మాత్రమే ఉన్నాయి. నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల డీసీఎంఎస్‌ల చైర్మన్లుగా మాత్రమే హస్తం పార్టీ నేతలున్నారు. మిగిలిన అన్ని డీసీఎంఎస్‌ల చైర్మన్లు ఇప్పటికీ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై చర్చ జరుగుతోంది. ఒకవేళ నామినేట్ చేస్తే అన్ని డీసీఎంఎస్‌లకు చేస్తారా? లేదంటే ప్రస్తుతం ఉన్న పాలకవర్గాన్నే కొనసాగిస్తారా? అనే సస్పెన్స్ ఒకటీ రెండు రోజుల్లో వీడనుంది. డీసీసీబీలతోపాటు డీసీఎంఎస్‌ల పదవీకాలం కూడా ఈ నెల 15తో ముగుస్తున్న విషయం విదితమే.





ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ కార్యాలయం

**కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు యత్నాలు?**

బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న డీసీఎంఎస్ చైర్మన్లను కాంగ్రెస్ పార్టీలోకి మార్చేందుకు ఆయా జిల్లాల్లోని కీలక ముఖ్యనేతలు కొంత మేర ప్రయత్నాలు జరిగినట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. డీసీఎంఎస్ చైర్మన్లను మల్కాపురం శివకుమార్ (మెదక్), లింగయ్య (ఆదిలాబాద్), శ్రీకాంత్‌రెడ్డి (కరీంనగర్), రామస్వామినాయక్ (వరంగల్), ప్రభాకర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), కృష్ణారెడ్డి (రంగారెడ్డి)లు ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. డీసీసీబీ చైర్మన్లు పార్టీ మారినట్లు వీరు కాంగ్రెస్‌లో చేరలేదు. ఇప్పుడు వీరి పదవీకాలాన్ని పొడిగింపు విషయానికి వచ్చే సరికి వీరిలో ఒకరిద్దరు పార్టీ మారతారని భావించారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పేందుకు ఆయా జిల్లాల్లోని కీలక కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. కొన్ని జిల్లాల్లో వీరిని చేర్చుకునే ప్రయత్నమే జరగలేదు. దీంతో వీరంతా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ డీసీఎంఎస్‌ల పాలకవర్గాన్ని నామినేట్ చేస్తారా? లేదంటే వీరినే కొనసాగిస్తారనేదానిపై శుక్ర, శనివారాల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయనే అభిప్రాయం సహకార వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

### జిల్లా చైర్మన్ అంజయ్య

వట్‌పల్లి(అందోల్): గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ గొల్ల అంజయ్య పేర్కొన్నారు. జిల్లాలోని జోగిపేట, నారాయణఖేడ్, రాయికోడ్ మండలాల్లోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.70 కోట్లను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. వట్‌పల్లి మండలానికి లైబ్రరీ రీడింగ్ రూం ఏర్పాటుకు సంబంధించి గురువారం స్థానికులతో కలసి ఓ అద్దె భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి గ్రామీణ యువతకు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠకులకు అవసరమైన నూతన పుస్తకాలు ఏర్పాటు, మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కేటాయింపులు చేస్తుందన్నారు. వట్‌పల్లి, అల్లాదుర్గం మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, శేషారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు రాంరెడ్డి, పత్రివిఠల్ ఏఎంసీ డైరెక్టర్‌లు దిగంబర్ రావు, హబీబ్‌మీయా, నాగయ్య పాపయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ చైర్మన్ అంజయ్యను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

# సైన్స్‌పై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నేడు ప్రపంచం సైన్స్ మీదనే ఆధారపడి నడుస్తుందని, అందులో భాగంగా విద్యార్థులు సైన్స్‌పై మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. 'కలాం స్ఫూర్తి యాత్ర'పేరుతో బయల్దేరిన ఆధునిక బస్సు ల్యాబ్ బెల్ గురువారం జిల్లాపరిషత్ పాఠశాలకు వచ్చిన సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మధులాష్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని తను సొంతగా అత్యంత ఆధునిక బస్సు ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైన్స్‌పై మరింత అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. ఇందులో రోబోటిక్, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్, వివిధ అంశాలపై అవగాహన కల్పించడం హర్షదాయకమన్నారు. ఈ ప్రదర్శనలను జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలో ప్రదర్శించే విధంగా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం నిర్వాహకులు మధులాష్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సైన్స్‌పై మరింత అవగాహన కలింపచాలన్న లక్ష్యంతో ఈ యాత్ర పేరిట 33 జిల్లాలలో పర్యటిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 25జిల్లాలలో పర్యటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పీపీ రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





వైజ్ఞానిక ప్రదర్శన బస్సు వద్ద జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుతో పాఠశాల సిబ్బంది

## క్లుప్తంగా

### రెవెన్యూ సర్వేయర్‌పై దాడి

పాపన్నపేట(మెదక్): రెవెన్యూ సర్వేయర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. సర్వేయర్ అహోబిలం శ్రీనివాస్ యూసుఫ్‌పేటలోని తీగల మల్లేశం అనే వ్యక్తికి చెందిన భూమిని సర్వే చేయడానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా గ్రామ బస్ స్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్, ఏర్పుల గంగయ్య సర్వేయర్ బైక్ ఆపి బూతులు తిడుతు దాడి చేశారు. హెల్మెట్‌తో కొట్టారు. సర్వేయర్ ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


క్రీడాకారిణి రాణి

గజ్వేల్: జాతీయస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు తొగుట మండల వరదరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బొంగోని రాణి ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తెలిపారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 14 నుంచి 18 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ సీనియర్ మహిళల విభాగంలో సిద్దిపేట జిల్లా నుంచి క్రీడాకారిణి ఎంపిక కావడం ఇది తొలిసారి అని పేర్కొన్నారు.

### ఎండు గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు ఎండు గంజాయిని పట్టుకున్న ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం లక్డారం ఎక్స్‌రోడ్‌లో బుధవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించాం పటాన్‌చెరుకు చెందిన అఖిల్, శశాంక్ రెడ్డి నుంచి 500 గ్రాముల ఎండు గంజాయిని, రెండు సెల్ ఫోన్లను, బైక్‌ని స్వాధీనం చేసుకున్నాం పట్టుబడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక డంప్‌లు సీజ్


ఇసుకను స్వాధీనం చేసుకున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను గురువారం సీజ్ చేసినట్లు ఆర్‌ఐ నాగరాజు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎంకెపల్లి గ్రామంలో వెళ్లి చూడగా మంజీరా నది తీరంలోని పలు పొలాలు, ఇళ్ల మధ్యన సుమారు 15 ట్రాక్టర్ల ఇసుక నిల్వ ఉంది. ఈ మేరకు స్థానిక ఏఎస్‌ఐ సంగన్న, పోలీసు సిబ్బంది సహాయంతో మొత్తం నాలుగు డంప్‌లను స్వాధీన పర్చుకున్నామన్నారు. అధికారుల సూచన మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

# స్థిరపడ్డాకే.. ప్రేమ–పెళ్లి

యువత ఆలోచనా విధానాల్లో రోజురోజుకూ మార్పు వస్తోంది. గతంలో దూకుడు కనిపించడమే కాక చిన్న విషయానికైనా తల్లిదండ్రులను ఎదురించాలనే ధోరణి ఉండేది. చదువుకుంటూనే ప్రేమించడం, జీవితంలో స్థిరపడకముందే అందరినీ ఎదురించి పెళ్లి చేసుకోవడం సాధారణంగా కనిపించేది. కానీ ప్రస్తుత యువతలో చదువు, ఆపై ఉద్యోగంతో జీవితంలో స్థిరపడటమే ప్రధానమనే భావన వ్యక్తమవుతోంది. ఆ తర్వాత ప్రేమ, పెళ్లి ఆలోచనలు చేయాలని చెబుతున్నారు. నేడు వాలంటైన్స్ డే సందర్భంగా గురువారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, సిద్దిపేట ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ, ఈఈఈఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో 'ప్రేమ పెళ్లి – పెద్దలు కుదిర్చిన పెళ్లి' అనే అంశంపై 'సాక్షి' డిబెట్ నిర్వహించింది. కార్యక్రమంలో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా అందులో 99 శాతం విద్యార్థులు పెద్దలు కుదిర్చిన పెళ్లికే ఓటు వేశారు. – మెదక్‌జోన్/సిద్దిపేట అర్బన్

#### జీవితంలో స్థిరపడ్డాకే..



ప్రేమ పెళ్లి అయినా.. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయినా జీవితంలో స్థిరపడ్డాకే చేసుకోవడం ఉత్తమం. ప్రేమ పెళ్లి తప్పుకాదు. ఇరు కుటుంబాలను ఒప్పించి చేసుకోవాలి. ఇందుకోసం ప్రధాన ఆయుధం జీవితంలో స్థిరపడటమే. తల్లిదండ్రులను బాధ పెట్టొద్దు. మనపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు.

– హారిక, బీకామ్, థర్డ్ ఇయర్

#### చదువే ప్రధాన లక్ష్యం



ఎంచుకున్న లక్ష్యం నెరవేరాలంటే ముందు చదువుపై దృష్టి పెట్టాలి. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. పెళ్లికి ముందు ఉన్న ప్రేమ పెళ్లి అనంతరం ఉండటం లేదు. ప్రేమ పెళ్లిళ్లు చాలా వరకు ఫెయిల్ అవుతున్నాయి. కొంతమంది మాత్రమే సక్సెస్ అవుతున్నారు.

–భాను ప్రసాద్, బీకామ్, థర్డ్ ఇయర్

#### అమ్మానాన్నల ఆశీస్సులతోనే..



ఎన్నో త్యాగాలు చేసి విద్యావంతులుగా తీర్చిదిద్దిన అమ్మానాన్నలను మర్చిపోవద్దు. ప్రేమిస్తే తల్లిదండ్రులను బాధ పెట్టకుండా ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. అప్పుడే జీవితంలో రాణించగలం. ఏ ఆపద వచ్చినా..అమ్మానాన్నలు అండగా ఉంటారనే మనోధైర్యం ఉంటుంది. వారు మనకు తోడుగా ఉంటారు.

– ప్రసన్నలక్ష్మి, బీకామ్

#### అవగాహన అవసరం



ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటే ఇద్దరి మధ్య అవగాహన చాలా అవసరం. చాలా మంది కేవలం ఆకర్షణకు లోనై ప్రేమ అనే భ్రమలో పడి పెళ్లి చేసుకుంటూ అగాధంలో కూరుకుపోతున్నారు. అలా కాకుండా ఒకరినొకరు అర్థం చేసుకొని అనుకున్న లక్ష్యం నెరవేరాక ప్రేమ పెళ్లి చేసుకోవాలి.

– రాజేంద్ర, బీకామ్

#### చదువు నిర్లక్ష్యం చేయొద్దు



ప్రేమ పేరుతో చదువును నిర్లక్ష్యం చేయొద్దు. జీవితంలో వెలుగు నింపే చదువును పక్కనబెట్టి ప్రేమపేరుతో వెంటపడి వేధించి బాధించడం సరికాదు. నిన్ను ఇష్టపడ్డ వారినే ఇష్ట పడాలి. బలవంతంగా ఇతరులను ఇబ్బందులను గురిచేస్తే ఇద్దరి చదువుతోపాటు జీవితాలు నాశనం అవుతాయి.

-నాగ మల్లీశ్వరి, బీకామ్


#### లక్ష్యం సాధించాకే..



జీవితంలో అనుకున్న లక్ష్యం సాధించాకే లవ్ జోలికి వెళ్తే బెటర్. కులాంతర వివాహాల వల్ల హత్యలు, ఆత్మహత్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇద్దరు ఇష్టపడితే ముందు వారు ఎంచుకున్న లక్ష్యం సాధించాక పెళ్లి చేసుకోవాలి. లేదంటే కుటుంబీకుల నుంచి వ్యతిరేకత రావడం జరుగుతుంది.

– రాజు, బీకామ్


సిద్దిపేటలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు





మెదక్ జోన్ : డిబెట్‌లో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

#### పెద్దల అండ అవసరం..



పెద్దలను కాదని ప్రేమ పెళ్లి చేసుకున్న వారికి ఏదైనా సమస్య కానీ ఆపద కానీ వస్తే పెద్దలు సహకరించే పరిస్థితి ఉండదు. అదే పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే ఏ సమస్య వచ్చినా మన వెనుక నిలబడి సమస్యను పరిష్కరిస్తారు. వారి సపోర్ట్‌తో ముందుకెళ్లవచ్చు.

- లోకేశ్ బాబు, విద్యార్థి

#### ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాలి



లోకేశ్ చెప్పినట్లు పెద్దలు కుదిర్చిన పెళ్లే బాగుంటుంది. ప్రేమ పెళ్లి అయితే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అదే పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే ఆర్థిక స్థిరత్వం ఉండేలా వారి తోడ్పాటు ఉంటుంది. ఏ ఇబ్బంది లేకుండా జీవితాన్ని లీడ్ చేయొచ్చు. ప్రేమ పెళ్లిలు చేసుకున్న వారు పెళ్లి తర్వాత ముందు ఉన్నంత ప్రేమగా ఉండడం లేదు.

-ఐశ్వర్య, విద్యార్థిని

#### మనస్పర్థలు వస్తాయి



పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే కాబోయే వ్యక్తి ఎలాంటి వాడు అనే విషయాలు ఏవీ తెలియకుండా అతడితో జీవితాన్ని పంచుకోవాలి. అదే లవ్ మ్యారేజ్ అయితే ఒకరినొకరం తెలుసుకొని అభిప్రాయాలు పంచుకుంటాం. అందువల్ల భవిష్యత్‌లో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చే అవకాశం తక్కువ ఉంటుంది.

- మధురిమ, విద్యార్థిని

#### కులాలు అంతమవుతాయి



ప్రస్తుతం ఎక్కడ చూసినా క్యాస్ట్ ఫీలింగ్ ఉంది. పెద్దలు కుదిర్చిన పెళ్లి వల్ల కులాల ప్రస్తావన ఎప్పటికీ అలాగే కొనసాగుతుంది. అదే ప్రేమ పెళ్లిలు చేసుకుంటే కొన్ని తరాల తర్వాత కులాల ప్రస్తావన లేకుండా పెళ్లిలు జరిగే అవకాశం ఉంటుంది. క్యాస్ట్ ఫీలింగ్ పోతుంది అని నా భావన.

- అజయ్, విద్యార్థి

#### తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడాలి



జీవితం అంటే ఏంటో తెలియని వయస్సులో ప్రేమ, పెళ్లి అని తిరగకుండా ప్రేమ, ఆకర్షణకు తేడా తెలుసుకోవాలి. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు మన గురించి మన కంటే ఎక్కువ తెలుసు. వారి గౌరవాన్ని కాపాడే విధంగా ప్రేమ జోలికి పోకుండా జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకోవాలి. అది కూడా పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలి. ఇరు కుటుంబాల పెద్దలు అండగా ఉంటే ధైర్యంగా ఉంటుంది.

- శైలజ, విద్యార్థిని

#### పెద్దలను ఒప్పించి చేసుకోవాలి



ప్రేమ పెళ్లి చేసుకోవాలనుకుంటే ముందుగా పెద్దలను ఒప్పించి చేసుకోవాలి. అలా అయితేనే జీవితం బాగుంటుంది. తల్లిదండ్రులను కాదని ప్రేమ పెళ్లి చేసుకోవడం వల్ల ఫ్యామిలీ సపోర్ట్‌కు దూరమవుతాం. పెద్దలను కాదని ప్రేమ పెళ్లి చేసుకొని సాధించేది ఏం ఉండదు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎవరి సపోర్టు ఉండదు. ముందుగా జీవితంలో బాగా స్థిరపడా లి. అప్పుడే లైఫ్ బాగుంటుంది.

- లోకేశ్, విద్యార్థి

### ఇన్‌స్టాగ్రామ్ కలిపింది



రేగోడ్(మెదక్): ఆమె పెళ్లే చేసుకోవాలనుకోలేదు.. కానీ ఇన్‌స్టాగ్రామ్ పెళ్లి చేసుకునేలా చేసింది. ఒక అబ్బాయితో ప్రేమలో పడేసి ఇద్దరినీ కలిపింది. ఫ్రెండ్స్‌గా ప్రేమతో పెళ్లి పీటల వరకూ వెళ్లింది. పెద్దలు వద్దన్నా.. ఇరువైపులా ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. జిల్లాలోని రేగోడ్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న పూజ తన ప్రేమ వివాహ మధురమైన జ్ఞాపకాలను గురువారం సాక్షితో పంచుకుంది. నేను పెళ్లే చేసుకోవాలనుకోలేదు. కానీ లాయర్ చదువుకునే రోజుల్లో 2018లో ఇన్‌స్టాగ్రామ్‌లో విక్రమ్ రాథోడ్ పరిచయమై ఫ్రెండ్స్‌గా ప్రేమలో పడ్డాం. మొదట పరిచయమవగానే ఇన్‌స్టాలో డైరెక్ట్‌గా పెళ్లి చేసుకుందామని నేనే ముందుగా ప్రపోజ్ చేశా. తను ఒప్పుకున్నా.. రెండు వైపులా పెద్దలు ఒప్పుకోలేదు. వారిని ఒప్పించడానికి చాలా కష్టపడ్డాం. అందరూ ఒప్పుకోవడంతో 2020 డిసెంబర్‌లో పెళ్లి చేసుకున్నాం. ప్రస్తుతం ఒక బాబుతో మా ఫ్యామిలీతో ఆనందంగా ఉన్నాం.

- పూజ, విక్రమ్ రాథోడ్

#### లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

- సిద్దిపేట సీపీ అనురాధ



సిద్దిపేటకమాన్: యువత జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, ఉన్నత చదువులు చదివి గొప్పగా స్థిరపడాలి. ప్రేమపేరుతో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలి. తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలి. ప్రేమ, పెళ్లి పేరుతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దు.

## రేషన్ బియ్యం అమ్మితే కఠిన చర్యలు

● సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారి శశిధర్ రాజు
● రామారం గ్రామంలో 431 క్వింటాళ్ల బియ్యం పట్టివేత


రైసుమిల్లులో అధికారులతో కలిసి మాట్లాడుతున్న శశిధర్ రాజు

దుబ్బాకటౌన్: ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికి అందిస్తున్నారని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారి శశిధర్ రాజు అన్నారు. సివిల్ సప్లయ్ కమిషనర్ ఆదేశాల మేరకు, నమ్మదగిన సమాచారంతో రాయపోల్ మండలం రామారం గ్రామ శివారులో సాయి మహాదేవ్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ట్రాన్స్‌కో అధికారులు స్థానిక పోలీసులతో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.15.5 లక్షలు విలువ గల దాదాపు 431 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సాయి మహదేవ్ మిల్లు ప్రభుత్వానికి 1,660 టన్నుల బియ్యం బాకీ ఉండడంతో దాదాపు రెండు సీజన్లు ప్రభుత్వం సీఎంఆర్ ఇవ్వలేదన్నారు. గుట్టుగా ఇతర వాహనాల నుంచి రేషన్ బియ్యం తీసుకొచ్చి మళ్లీ వాటిని రీసైక్లిలింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వాన్ని రెండు రకాలుగా మోసం చేస్తున్నారన్నారు. రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని కామారెడ్డి, హన్మకొండ, సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లు లీజుకు తీసుకొని నడిపిస్తున్న సాయి కుమార్ రెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పట్టుబడిన బియ్యాన్ని దౌల్తాబాద్ పౌర సరఫరాల గోదాముకు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ తనుజ, ఎస్‌ఐ ప్రేమదీప్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల చెరలో దొంగలు

● నెల రోజులుగా ఇళ్లల్లో వరుస చోరీలు
● నగదు, బంగారం అపహరణ
● పట్టుకొని పోలీసులకు అప్పగించిన పెద్దారెడ్డి పేట యువకులు


గ్రామస్తులు పట్టుకున్న దొంగలు

పుల్‌కల్(అందోల్): నెల రోజులుగా మూడు గ్రామాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను గురువారం రాత్రి పెద్దారెడ్డిపేట యువకులు పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. నేరడిగుంట చౌరస్తాలో గురువారం రాత్రి ఓ హోటల్‌లో చోరీకి ప్రయత్నించారు. అక్కడ ఏం దొరక్కపోవడంతో రెండు వంట గ్యాస్ సిలిండర్‌లను దొంగిలించి పెద్దారెడ్డిపేట వైపు బైక్‌పై వెళ్తున్నారు. అక్కడి వారు పెద్దారెడ్డిపేట గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామ యువకులు ఏకమై బైక్‌లపై వస్తున్న దొంగలను మాటువేసి పట్టుకున్నారు. వీరు నెల రోజుల నుంచి పెద్దారెడ్డిపేటలో 5 ఇళ్లలో, రాయిపాడు, మంతూరులో రెండేసి ఇళ్లలో దొంగతనం చేశారని గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. దొంగతనం జరిగిన ఇళ్లలో బంగారం, నగలు, నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతి కుమార్‌ను వివరణ కోరగా దొంగలను జోగిపేట సీఐకి సరెండర్ చేశామని తెలిపారు. సీఐ విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## వేధింపులతోనే నా భర్త ఆత్మహత్య

రమేశ్ బలవన్మరణంపై భార్య పోలీసులకు ఫిర్యాదు


ఫిర్యాదు కాపీని చూపుతున్న గాయత్రీ

మెదక్ మున్సిపాలిటీ: అప్పుల వారి వేధింపులు తట్టుకోలేకనే నా భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మల్లికార్జున రమేశ్ భార్య గాయత్రీ గురువారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూపర్ మార్కెట్ నిర్వాహకు రమేశ్ 30 మంది నుంచి దాదాపు రూ.30 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు తెలిపారు. 11న ఉదయం ఇంటి వద్ద నుంచి సూపర్ మార్కెట్‌కు వెళ్లగా అక్కడికి కొందరు అప్పుల వాళ్లు వచ్చి డబ్బులు వెంటనే చెల్లిస్తావా? చస్తావా? లేకుంటే చంపుతామంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వేధింపులు తట్టుకోలేక సూపర్ మార్కెట్ పెంట్‌హౌస్‌పై రమేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఆ రోజు ఎవరెవరు వచ్చి బెదిరించారో వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

## షూటింగ్ సందడి


షూటింగ్‌లోని ఓ సన్నివేశం

జోగిపేట(అందోల్): నటీనటులు సత్య వినుకొండ, అనుశ్రీ హీరో హీరోయిన్లుగా ఎస్‌ఎస్ మూవీ కార్పొరేషన్ బ్యానర్‌లో రూపొందుతున్న 'వాషింగ్టన్ సుందర్' సినిమా షూటింగ్‌ను గురువారం జోగిపేట ప్రాంతంలో నిర్వహించారు. కొంత మంది నటులు మద్యం సేవిస్తున్నట్లుగా, ఒక ఇంటికి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో జోగిపేట పరిసర ప్రాంత నటులు కూడా నటించడం విశేషం. షూటింగ్ జరుగుతున్నట్లు తెలుసుకున్న స్థానికులు తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.

### దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

నర్సాపూర్ రూరల్: దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. నర్సాపూర్ మండలం ఎర్రకుంట తండాకు చెందిన మూడవత్ శ్రీను, భార్య శాంతి, కుమారుడు అఖిల్ కలిసి 1వ తేదీన ఇంటికి తాళం వేసి వంట చెరుకు కోసం అడవికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన ఓ వ్యక్తి ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలోని రూ.2.60 లక్షలు నగదు, వెండి గొలుసులు ఎత్తుకెళ్లాడు. బాధితుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గురువారం నమ్మదగిన సమాచారం మేరకు శ్రీనుకు చిన్నాన్న అయిన మూడవత్ అంజ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి నగదు, గొలుసులు స్వాధీనం చేసుకొని అంజ్యను కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ జాన్ రెడ్డి తెలిపారు.

## ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఖాజీపేటలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొత్తగొండ్ల దశరథ గౌడ్ (32) గురువారం గ్రామ సమీపంలోని వీరయ్య కుంట వద్దకు మలవిసర్జన కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందినట్లు తెలిపారు. అటుగా వెళ్లిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని దశరథ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### స్కూటీ పైనుంచి పడి వ్యక్తి..

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): స్కూటీ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఎల్లారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గురువారం సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. మండలంలోని యెట్టిగడ్డ సంఘం గ్రామానికి చెందిన బంటు శంకరయ్య(49) వ్యవసాయం చేస్తుంటాడు. 12న మునిపల్లి మండలంలోని మల్లికార్జునపల్లిలో బంధువుల ఇంటికి శుభకార్యానికి స్కూటీపై వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా అల్లాపూర్ గ్రామ శివారులో మొదటగా అదుపుతప్పి పడటంతో గాయాలు అయ్యాయి. అదే గాయాలతో ఎల్లారం మీదుగా ఆత్మకూర్ వెళ్లే మట్టి రోడ్డులో గంగాకత్వ కాల్వకు సమీపంలో మరోసారి కిందపడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

### తిరుమలలో సంగారెడ్డి జిల్లావాసి మృతి

సంగారెడ్డి క్రైమ్: తిరుమల దైవదర్శనానికి వెళ్లిన సంగారెడ్డి జిల్లా మహిళ అనుమానాస్పద స్థితిలో అక్కడ మృతి చెందారు. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని ఎల్‌ఆర్ కాలనీకి చెందిన నడిమిది రవి, అరుణ జ్యోతి(29) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అరుణ జ్యోతి 6వ తేదీన తిరుమల దైవ దర్శనానికి ఒంటరిగా వెళ్లింది. తిరుమల పరిధిలోని ఓ కాల్వలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయాన్ని తిరుమల పోలీస్‌లు 12న (బుధవారం) భర్త రవికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆందోళన చెందిన రవి గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు.